క్లుప్తంగా

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మొగిలి



శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలిని బీజేపీ సంస్థాగత ఎన్నికల్లో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా మంగళవారం ఎన్నుకున్నారు. మొగిలి వివిధ హోదాలో 30 ఏళ్ల నుంచి బీజేపీలోనే పని చేస్తున్నారని పార్టీ ఏ బాధ్యత ఇచ్చిన కూడా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాడు. తన ఎన్నికకు సహకరించిన భూపాలపల్లి నియోజకవర్గ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులో బయో ఫర్టిలైజర్

శాయంపేట : భూసార అభివృద్ధికి, పంట పెరుగుదలకు కావల్సిన పోషకాలు అందించడం కోసం భాస్వరాన్ని కలిగించే బయో ఫర్టిలైజర్(జీవన ఎరువు) ఫాస్ఫేట్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్‌బీ) ప్రగతి సింగారం సెక్టార్‌లో అందుబాటులో ఉన్నాయని ఏఈఓ సుప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి సింగారం సెక్టార్‌కు చెందిన రైతులు బయోఫర్టిలైజర్ కావల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు ఇవ్వాలని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ప్రభాస్



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ముత్తారం గ్రామానికి చెందిన కడారి ప్రభాస్ మంగళవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి నియామక పత్రం అందజేశారు. ప్రభాస్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తాని చెప్పారు. ఈనెల 7న హైద్రాబాద్‌లో జరిగే 'వేల గొంతుకలు, లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, రాజ్‌కుమార్, దిలీప్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

పరకాల: సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చి.. తనకు చదువుకోవడం ఇష్టం లేదంటూ మానసికంగా ఇబ్బంది పడిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెల్లంపల్లిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతికుమార్ కథనం ప్రకారం వెల్లంపల్లికి చెందిన పాతరాజు యశ్వంత్(18) సంక్రాంతి సెలవులకు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చాడు. తనకు చదువు రావడం లేదు, తిరిగి హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేదని తల్లిదండ్రులతో పేర్కొన్నాడు. ఏదో విధంగా మెప్పించి పంపించినా జనవరి 31న సాయంత్రం 7 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత గడ్డిమందు సేవించి అపస్మారస్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

14 రోజుల రిమాండ్

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన మంద బాబు కొట్టుకున్న కేసులో మంగళవారం పరకాల మెజిస్ట్రేట్ లింగం శాలిని 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద బాబు ఇటీవల గ్రామంలో ఒక వ్యక్తితో గొడవపడి కొట్టుకోగా బాబుపై కేసు నమోదు చేసి పరకాల కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ శాలిని బాబుకు 14 రోజుల రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

ఎల్కతుర్తి : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బెల్టుషాపును నడిపిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు స్థానిక పోలీసులు మంగళవారం ఓ బెల్టుషాపుపై దాడులు నిర్వహించి అక్రమంగా నిలువ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బావుపేటకు చెందిన పున్నం శ్యామల గ్రామంలో కొన్నేళ్లుగా ఎలాంటి అనుమతి లేకుండా బెల్టుషాపు నడిపిస్తుందన్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు బెల్టుషాపుపై దాడులు నిర్వహించగా రూ.11 వేలు విలువచేసే మద్యం బాటిళ్లను స్వాధీన పర్చుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలి పారు. అనుమతి లేకుండా ఎవరైనా మద్యం విక్రయించినట్లు తెలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఏఎస్సై సయ్యద్ ఉబైదుల్లా, తదితరులు ఉన్నారు.

పల్లె ప్రకృతివనాలపై పట్టింపేది ?

- కనిపించని ఆహ్లాదం, కానరాని పచ్చదనం
- ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, విరిగిన బెంచీలు



వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం



ల్యాదెళ్లలో దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

దామెర : పల్లెల్లో పచ్చదనం వెల్లివిరియాలని, ప్రజలకు ఆహ్లాదం కలిగించే విధంగా పల్లెప్రకృతి వనాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలోని 14 గ్రామాలకు 13 గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల వైపు గ్రామ పంచాయతీ సిబ్బంది కన్నెత్తి చూడకపోవడంతో అస్తవ్యస్తంగా దర్శనమిస్తునాయి. ఎండిన మొక్కలు, ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, విరిగిన బెంచీలు, పెరిగిన పిచ్చిమొక్కలతో, ఎండిన ఆకులు, చెత్తాచెదారంతో కళావిహీనంగా ప్రకృతి వనాలు తయారయ్యాయి.

నిధులున్నా.. పాటించని నిబంధనలు

ఒక్కో ప్రకృతి వనానికి ఉపాధిహామీ నిధుల నుంచి రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా రూ.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించారు. లక్షలు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోయింది. మొదట్లో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేసేందుకు హడావుడి చేసిన అధికారులు నిర్వహణపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పల్లెప్రకృతి వనాల ఏర్పాటులో భాగంగా 4–5 వేల మొక్కలు నాటి చిట్టడివిగా తీర్చిదిద్దాలి. పార్కులో సేద తీరేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు పండ్లు, నీడనిచ్చే మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి. మొదట్లో నిబంధనలకు లోబడి ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. కానీ వాటికి నిర్వహణ కరువై ప్రకృతి వనాలు కాస్తా వికృత వనాలుగా మారాయి.

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా..

పల్లె ప్రకృతి వనాలు నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో ప్రకృతివనాలు ఏర్పాటు చేసి ఫెన్సింగ్ చేయడం మరిచారు. దీంతో పశువులు యథేచ్ఛగా అందులోకి ప్రవేశించి సుందరీకరణ మొక్కలతో పాటు పలు పండ్ల మొక్కలను కనిపించకుండా చేశాయి. వాకింగ్ ట్రాక్‌లను ధ్వంసం చేయడంతో పాటు పలుచోట్ల ఏర్పాటుచేసిన బెంచీలు విరగ్గొట్టాయి. రాత్రి సమయాల్లో మందుబాబులు మద్యం సేవించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకొని ఎంజాయ్ చేస్తున్నారని గ్రామస్తులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

ఎండిపోతున్న మొక్కలు



గ్రామంలోని గుట్ట, గుండ్లు ఉన్నచోట పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. అనంతరం దాని నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో పెద్ద ఎత్తున మొక్కలు ఎండిపోయాయి. అధికారులు దృష్టి సారించాలి.

– పిట్టల రమేశ్, ల్యాదెళ్ల

ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం

పల్లెప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై గ్రామపంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు చేశాం. సూచనలు చేసి, వాటికి పూర్వ వైభ వం వచ్చేలా చర్య తీసుకుంటాం.

–రంగాచారి, ఎంపీఓ, దామెర

మెనూ పాటించని ఆశ్రమ గురుకుల పాఠశాల



డస్ట్ బిన్‌లో పడేసిన భోజన వ్యర్థాలు

దామెర: విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతన మెనూ ప్రారంభించింది. కానీ గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో నూతన మెనూ అమలుచేయడం లేదంటూ వస్తున్న వార్తలపై 'సాక్షి' మంగళవారం విజిట్ చేసి విద్యార్థులను వివరాలు అడిగితెలుసుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల నూతన మెనూ ప్రకారం మంగళవారం బ్రేక్‌ఫాస్ట్‌లో భాగంగా ఇడ్లీ సాంబర్, మిల్క్ విత్ బూస్ట్ ఇవ్వాల్సి ఉంది. కాగా కిచిడీ మాత్రమే ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. బ్రేక్ టైంలో జామకాయ, అరటిపండు ఇవ్వాల్సి ఉండగా ఏమీ ఇవ్వలేదని అన్నారు. మధ్యాహ్న భోజనంలో బీట్‌రూట్ కర్రీ, దోసకాయ పప్పు, ఘీ, రసం, పెరుగు, బాయిల్డ్ ఎగ్ ఇవ్వాల్సి ఉండగా కాకరకాయ కర్రీ, పప్పు, సాంబర్, మజ్జిగ మాత్రమే ఇచ్చారన్నారు. సాయంత్రం స్నాక్స్ ఇవ్వడంలేదని విద్యార్థులు వాపోయారు. అంతేకాకుండా నాణ్యత లేని భోజనం వడ్డించడంతో ఎక్కువ శాతం డస్ట్‌బిన్‌లో పడేసి ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టిసారించి నూతన మెనూ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఈ విషయమై వార్డెన్ శ్రీమతిని వివరణ కోరగా బ్రేక్ ఫాస్ట్ తయారుచేయడానికి వంటపాత్రలు లేక అన్ని రకాల టిఫిన్లు తయారు చేయలేకపోతున్నామని అన్నారు. అదే విధంగా మెనూ ప్రకారం వంట సామగ్రి రావడంలేదని వెల్లడించారు.

నీటిని తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి



వేలేరు : మండలంలోని క్యాతంపల్లి గ్రామ పరిధిలోని గూడెపు చెరువు కాల్వ నుంచి అక్రమంగా నీటిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సదానందంకు క్యాతంపల్లి రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని గూడెపు చెరువును దేవాదుల పైప్‌లైన్ ద్వారా నింపుకుని గొలుసు కట్టుగా వెంకటేశ్వర్లకుంట, మాటుకుంట, తిమ్మంకుంట, గుర్రాలకుంట, మత్తడి చెరువు, బూరుగుకుంట, సాయిపేట ఊర చెరువులను కాల్వద్వారా నింపుకునే సౌకర్యం ఉండేది. కొన్ని రోజుల నుంచి రాయిగూడెం, బాలాజీతండా రైతులు ఆయా చెరువులకు వెళ్లే కాల్వపై సుమారు 40 మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. దీంతో తమ చెరువులు నిండటం లేదని, తమ పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వపై మోటార్లు ఏర్పాటు చేసిన వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు చాడ నర్సింహరెడ్డి, పిన్నపురెడ్డి విప్లవ్‌కుమార్ రెడ్డి, పెరుమాండ్ల మహేందర్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురోగతి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



దామెర : మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న విజయచందర్ రెడ్డి

రాష్ట్ర పురోగతి లక్ష్యంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, శాయంపేట, కమలాపూర్ బీజేపీ మండల అధ్యక్షులు నరహరిశెట్టి రామకృష్ణ,ర్యాకం శ్రీనివాస్ అన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రాల్లో నరేంద్రమోదీ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. డబుల్ ఇంజన్ సర్కారుకు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికి రానున్న ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



శాయంపేటలో..



కమలాపూర్‌లో..

ఒత్తిడిని తగ్గించేందుకు టెలిమానస్ సేవలు



కమలాపూర్ : ఒత్తిడిని దూరం చేసేందుకు అందుబాటులోకి తీసుకొచ్చిన టెలిమానస్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ సూచించారు. స్థానిక ఎంజేపీ గురుకుల కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భయపడుతూ చదివితే చదివిన విషయాలు మర్చిపోయే ప్రమాదం ఉందని, ఏకాగ్రతతో చదువుతూ పరీక్షలు రాయాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల మానసిక పరిస్థితి ఎలా ఉందో గమనించాలన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, పిల్లలను ఇతర పిల్లలతో పోల్చకుండా వారికేదైనా సమస్య ఉన్నట్లు తెలిస్తే మేమున్నామన్న భరోసా ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే 14416 టెలిమానస్ నంబర్‌కు కాల్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవితారెడ్డి, సోషల్ వర్కర్ నరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఆత్మకూరు : మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ స్పందన అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బేటి బచావో–బేటి పఢావో పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ ఆడ పిల్లలను రక్షించాలి

శాయంపేట : ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను రక్షించాలని, ఉన్నతమైన చదువులను చదివించాలని వైద్యులు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు బే బచావో–బేటి పఢావో కార్యక్రమంపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 17 వరకు జరిగే నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు : సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ భారతి అన్నారు. మండలంలోని చౌళ్లపల్లిలో మంగళవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖి సెంటర్ ఉద్దేశాలను వివరించారు. కౌన్సిలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి సదుపాయాల కోసం మహిళలు సఖి కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 181 ద్వారా మహిళలకు సహాయం లభిస్తుందన్నారు.

'రెడ్డి'లను కించపరిస్తే ఊరుకోం

కమలాపూర్ : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన తీరు, వైఖరి, భాష మార్చుకోవాలని, రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోబోమని తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందుపట్ల నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కోసం ఒక వర్గాన్ని కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

రిజర్వేషన్‌ను ఎత్తివేసేందుకు కుట్ర



పరకాల: అగ్రవర్ణ పేదల రిజర్వేషన్‌ను ఎత్తివేసేందుకు కుట్ర జరుగుతుందని ఓసీ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓసీ సంఘాల మీద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యక్తిగత దూషణలు చేయడాన్ని నిరసిస్తూ పరకాల అమరధామం వద్ద ఆందోళన నిర్వహించారు. తీన్మార్ మల్లన్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీవీపీ సేవలు వినియోగించుకోవాలి

దామెర : భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ డి.సుధీర్ కుమార్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ ఫార్మసీ కళాశాలలో మండలంలోని కోగిల్వాయి, పసరగొండ రైతులకు 2 పవర్ స్ప్రేయర్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్గానిక్ పంటలు పండించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆదామ ఇండియా కంపెనీ సహకారంతో రైతులకు ఇప్పటి వరకు 9 పవర్ స్ప్రేయర్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఒక్కో పవర్ స్ప్రేయర్‌ను సహకార పద్ధతిలో 10 మంది రైతులు వినియోగించుకోవాలని వివరించారు. బీవీపీ ఆధ్వర్యంలో వివిధ వర్గాల వారికి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బీవీపీ కార్యదర్శి కె.సత్యనారాయణ, బాధ్యులు జయపాల్‌రెడ్డి, దామోదర్, యూత్ సేవా కో ఆర్డినేటర్ మల్లికార్జున్, రైతులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మత్స్యకారుల కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుమార్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మత్స్యకార్మికులు

పరకాల: మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకారుల కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మోరె కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 6న నిర్వహించ తలపెట్టిన మత్స్యకారుల జిల్లా సదస్సు వాల్ పోస్టర్లను పరకాల చేపల మార్కెట్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుమార్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి అమలు చేస్తున్న ఉచిత చేప, రొయ్య పిల్లల పంపిణీ టెండర్ల పద్ధతిలో కాకుండా నేరుగా మత్స్యసొసైటీ బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. చెరువులు, కుంటను కబ్జాలు, కాలుష్యం నుంచి రక్షించి శాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సదస్సుకు మత్స్యకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం పరకాల మండల నాయకులు మోరె పరశురాములు, విక్రమ్, కిరణ్, రాజు, బొజ్జం శ్యామల, బొజ్జం రజిత, కోమల, రజిత, స్వరూప, సరోజన, వినోద, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు పరిష్కరిస్తాం



దామెర : మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

దామెర/వేలేరు/ఐనవోలు: ఓటరు జాబితాపై అభ్యంతరాలను పరిష్కరిస్తామని దామెర, ఐనవోలు ఎంపీడీఓలు కల్పన, పులి వెంకటేశ్వర్లు వేలేరు ఎంపీఓ జి.విమల అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయాల్లో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న కొంతమంది నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా పూర్తి స్థాయిలో సవరించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశాల్లో ఎంపీఓలు రంగాచారి, రఘుపతిరెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వేలేరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఓ విమల



ఐనవోలు : సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, నాయకులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటిపై ఏసీపీ విచారణ



విచారణ జరుపుతున్న ఏసీపీ తిరుమల్

కమలాపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఐదుగురిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుపై కాజీపేట ఏసీపీ తిరుమల్ మంగళవారం విచారణ చేపట్టారు. మండలంలోని మర్రిపల్లిగూడెం శివారులో కరీంనగర్ జిల్లా పాతర్లపల్లికి చెందిన నందికొండ రాజుకు ఉన్న రెండెకరాల భూమి కోసం గత నెలలో కాల్వ తీస్తున్న క్రమంలో పాతర్లపల్లికి చెందిన కొడారి అయిలుకొమురు, కొడారి తిరుపతి, కొడారి స్వరూప, నాల శ్యామల, కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన సల్వాల కుమారస్వామిలు అడ్డుకుని కులం పేరుతో దూషించారని బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు విషయంలో రాజుకు చెందిన వ్యవసాయ భూమిని, కాల్వను ఏసీపీ పరిశీలించి ఇరువర్గాల వారితో పాటు సాక్షులను విచారించారు. ఏసీపీ వెంట స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు మట్టి విక్రయాలు

ఆత్మకూరు : ప్రభుత్వ పనుల పేరుతో ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరిపి ప్రైవేట్ వ్యక్తులకు మట్టిని విక్రయిస్తున్నారని అక్కంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణానికి అని చెప్పి మట్టి తవ్వకాలు జరిపి గ్రామంలో యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తున్నారని తెలిపారు. అలాగే జీపీకి సంబంధించిన ట్రాక్టర్ డ్రైవర్ మట్టిని తరలిస్తున్నాడని ఆరోపించారు. మట్టి తవ్వకాలు జరిపే వారిపై అధికారులు చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

భ్రూణహత్యలు నేరం



ధర్మసాగర్ : అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

ధర్మసాగర్ : భ్రూణహత్యలు, లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. జిల్లా వైద్యాఆరోగ్య శాఖ పిలుపు మేరకు స్థానిక పీహెచ్‌సీ నుంచి మెయిన్ రోడ్డు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలను వివక్షతో చూడకుండా మగపిల్లలతో సమానంగా చదివించాలని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బానోత్ నెహ్రూచంద్ నాయక్, సూపర్‌వైజర్లు రాంమోహన్, సులోచన, ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

దామెర : బాలబాలికల హక్కులకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల విద్యాధికారి లకావత్ రాజేశ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం లింగాధారిత వివక్ష, లింగ సున్నితత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలతో, ఆశయాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ రవీందర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఐనవోలు: కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్‌కు కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందని, అందుకు నిరసనగా మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసింది. మండల కమిటీ సభ్యుడు కొంకాల నారాయణరెడ్డి మాట్లాడుతూ మామునూరు ఎయిర్‌పోర్టును రెండేళ్లలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని బీజేపీ నాయకులు ఊదరగొట్టారని బడ్జెట్‌లో మాత్రం నిధుల కేటాయింపు లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో యాకూబ్, మహేందర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.